క్లుప్తంగా

ఈపురుపాలెం పోలేరమ్మ తిరునాళ్లు రేపు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం రైల్వేస్టేషన్ వద్ద వేంచేసియున్న ఈపురుపాలెం పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు మంగళవారం వైభవంగా నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈపురుపాలెం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, ప్రత్యేక పూజలు, మ్యూజికల్ నైట్‌తో తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నామని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి: పట్టణంలోని పాత విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ దమోదరం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా పట్టణంలోని నంబూరిపాలెం, మౌలానగర్‌కు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

21న పరుశువేదీశ్వరుని కళ్యాణం

బల్లికురవ: మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో వేంచేసి యున్న గంగా పార్వతీ సమేత పరుశువేదీశ్వర స్వామి 21వ శాంతి కళ్యాణం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులు స్వర్ణ రాంబాబు శర్మచే ఉదయం 5 గంటల నుంచే ఆలయంలోని విఘ్నేశ్వరునికి పంచాతమృతాభిషేకం ప్రత్యేక అలంకరణ, పుణ్యాహవచనం, శివుడు.. పార్వతీ అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక అలకంరణ అనంతరం స్వామి అమ్మవార్ల ఉచ్చ విగ్రహాలను ప్రత్యేక వేదిపై ఉంచి శాంతి కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు హాజరై ఆ స్వామివార్ల కృతపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ వారు కోరారు.

కరుణించు గంగమ్మ తల్లీ!


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

కారంచేడు: ఖరీఫ్ సాగు ప్రారంభించే ముందుగా గ్రామ దేవతకు రైతులు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామానికి చెందిన భక్తులు, మహిళలు, వేరు వేరు ఊర్లలో ఉంటున్న గ్రామ ఆడపడుచులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. అమ్మవారి దర్శనం కలిగితే కోరిన కొర్కెలు తీరతాయని భక్తులు విశ్వాసం. సంతాన లేమితో బాధపడే వారు, విజయాల కోసం ఎదురు చూసేవారు, సాగుకు ముందుగా అమ్మవారికి రైతులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం వారు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు సైతం తీర్చుకుంటుంటారు. భక్తులతో ప్రత్యేక పూజలు చేయించిన ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పర్చూరులో నాకా బందీ


పర్చూరులో నాకాబందీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ మాల్యాద్రి

పర్చూరు(చినగంజాం): పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఎస్‌ఐ మాల్యాద్రి ఆదివారం నాకాబందీ నిర్వహించారు. ఆయన పలు వాహనాలను ఆపి సరైన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా లేదా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనంపై హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

శ్రీశ్రీ స్ఫూర్తితో సమాజాభివృద్ధి


ఘంటసాల విగ్రహం వద్ద మాట్లాడుతున్న కోట వెంకటేశ్వర రెడ్డి

చీరాల రూరల్: మహాకవి శ్రీశ్రీ అభ్యుదయ గీతాలు కష్టజీవులకు అండగా నిలవడమే కాకుండా సమాజాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ్డాయని ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెకంటేశ్వర రెడ్డి అన్నారు. మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని ఊరూరా జనవిజ్ఞానం, నవ్యాంధ్ర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద రాష్ట్ర ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. శ్రీశ్రీ రచనలు, గ్రంథాలు వాడుక భాషలో ఉండేవన్నారు. అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘాలకు అధ్యక్షులుగా పనిచేసి సమాజాభివృద్ధికి తన వంతు కృషి చేశారని కొనియాడారు. అప్పన్నరెడ్డి, సూర్యనారాయణ, జేజీ బాబు, శామ్యూల్‌రాజు, ఎస్.కె. సుభాని, చెంగల్వ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


సోమవరప్పాడులో శిథిలావస్థకు చేరి.. కూలే దశలో విద్యుత్ పోల్


కిందకు జారిన విద్యుత్ సప్లై వైర్లు


కొండాయపాలెంలో అలంకారప్రాయంగా ట్యాంక్

శివారుపై శీతకన్ను

- అసౌకర్యాల నడుమ పంచాయతీల శివారు ప్రాంతాలు
- ఎటు చూసినా సమస్యలతో సహవాసం
- పట్టించుకోని పాలకులు అధికారులు


మల్లయపాలెం యానాది సంఘంలో అధ్వాన స్థితిలో అంతర్గత రోడ్డు

బల్లికురవ:

గ్రామ పంచాయతీల పరిధిలోని శివారు గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంగా ఉంటున్నాయి. మండలంలోని 21 గ్రామపంచాయతీలు, 16 శివారు గ్రామాలున్నాయి. వీటిలో 12 గ్రామాల ప్రజలు అసౌకర్యాల మధ్యే కాలం వెళ్లదీస్తున్నారు. సోమవరప్పాడుడు, కోట వారి పాలెం, కొండాయపాలెం, చవిటి మాదిగ పల్లె, గంగపాలెం, జమ్మలమడక కాలనీ, బుసవారి పాలెం, సిపాయి కాలనీ, అరుణగిరి తండా, కూకట్లపల్లి యానాది సంఘం, కొత్త మల్లయ్య పాలెం, యానాది సంఘాలు ఆయా పంచాయతీలకు దూరంగా ఉంటాయి. అయితే ఈ ప్రాంతాల్లో మంచి నీరు, బస్సు వసతులు అంతంత మాత్రమే. సోమవరప్పాడు వాసులు తమ బిడ్డలను ఉన్నత చదువుకు పంపాలంటే 5 కిలోమీటర్లు కాలినడకనే వెళ్లాలి. ఇదే పరిస్థితి జమ్మలమడక కాలనీ, అరుణగిరి తండా, కోట వారి పాలెం, సిపాయి కాలనీలో కూడా నెలకొంది.

అలంకారప్రాయంగా మంచినీటి పథకాలు

సోమవరప్పాడు, కొండాయపాలెం, జమ్మలమడక కాలనీ, కొత్త మల్లయ్య పాలెం, కోటవారి పాలెం అరుణ గిరి తండా, చవిటి మాదిగ పల్లెకు రక్షితపథకాలు ఉన్నా అవి అలంకార ప్రాయంగా మారాయి. సాంకేతిక లోపాలతో పనిచేయడం లేదు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ అస్తవ్యస్తంగానే ఉంది.

విద్యుత్ సమస్యలతో విలవిల

సోమవరప్పాడులో నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి చువ్వలు బయటపడ్డాయి. ఈ పరిస్థితులకు తోడు సప్లై వైర్లు కిందకు జారాయి. ఇదే పరిస్థితి జమ్మలమడక కాలనీలు, కొండాయపాలెం, చవిటిమాదిగ పల్లె, కోట వారి పాలెం, గంగపాలెం గ్రామాల్లో కూడా నెలకొంది. రెండు రోజుల క్రితం సోమవరప్పాడులో చావలి వెంకటాద్రి సుమారు రూ. 40000 వేలతో రెండు ఎకరాల్లో వరిగడ్డి కొనుగోలు చేసి గ్రామంలోకి తీసుకొస్తుండగా విద్యుత్ తీగలు ట్రాక్టర్ ట్రక్కు తగిలి వరిగడ్డి మొత్తం అగ్నికి ఆహుతైంది. ఒక్కో గ్రామంలో 600 నుంచి 800 వరకు జనాభా నివసిస్తున్నారు.

మమ్మల్ని పట్టించుకోండి



1986లో కరణం బలరాం ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు విద్యుత్ సౌకర్యం కల్పించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోల్స్ మార్చలేదు. కిందకు జారిన సప్లై వైర్లు సరి చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం మంచి నీటి పథకం ఏర్పాటు చేసిన స్టోరేజ్ చెరువు ఏర్పాటు చేసినా అది అలంకారప్రాయమైంది. గ్రామానికి బస్సు వసతి లేనందున ఇబ్బందులు పడుతున్నాం.

– కొండవర్తి సాంబయ్య (సోమవరప్పాడు)

శివారు గ్రామాలపట్ల చిన్నచూపు విడనాడండి



పాలకులు అధికారులు శివారు గ్రామాలు, తండాలు, యానాది సంఘాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయి. అక్కడి ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. సురక్షిత మంచినీరు అందక అనారోగ్యం బారిన పడుతు వైద్యానికి వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగానే ఉంది. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం.

– తంగిరాల వెంకటేశ్వర్లు (వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు)

కనక నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు


ఆలయ పరిసరాల్లో పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో కనక నాగవరపమ్మ అమ్మవారు

వేటపాలెం: రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసి భక్తులు కోరిన కోర్కెలు తీర్చి కల్పవల్లి కనక నగవరపమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఆదివారం కావడంతో చుట్టు పక్కల గ్రామాలైన సంతరావూరు, చీరాల, జాండ్రపేట, ఈపురుపాలెం, పందిళ్లపల్లి, దూరప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తుల కార్లు, బస్‌ల్లో, ఆటోలు ఆలయానికి తరలి వచ్చారు. ఆలయం పరిసరాలు భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించు కొని అమ్మవారిని దర్శించు కొని మొక్కులు తీర్చుకొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరింపజేశారు. ఆలయ ఈఓ పోతిన శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


ఆలయ పరిసరాల్లో పోటెత్తిన భక్తులు

ఈకేవైసీ చేయించుకోండి

బల్లికురవ: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులంతా ఈకైవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి. శ్రీనవాసరావు ఆదివారం తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఈ సాయాన్ని పొందేందుకు రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను ఈ నెల 20వ తేదీ లోపు సంప్రదించి బయోమెట్రిక్ వేయాలన్నారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులకే అన్నదాత సుఖీభవ సొమ్ము జమ అవుతుందని శ్రీనివాసరావు వివరించారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం ధనిష్ట నక్షత్రం పంచమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

గుర్రపు డెక్క తొలగించండి


గుర్రపుడెక్కతో నిండిన పంట కాలువలు పరిశీలిస్తున్న రమణారెడ్డి, తదితరులు

చీరాల టౌన్: రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. పంటలకు సాగునీరు అందించాల్సిన కాలువలు గుర్రపు డెక్కతో నిండిపోయింది రైతులకు సాగునీరు సక్రమంగా అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు పనులు చేయించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు కె.రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కొమ్మమూరు కెనాల్ నుంచి సాగునీరు సరఫరా అయ్యే బోయినవారిపాలెం, స్వర్ణపురం కెనాల్స్‌ను వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పరిశీలించారు. కెనాల్లు రెండు గుర్రపు డెక్కతో నిండిపోవడంతో రైతులకు సాగునీరు సరఫరా సక్రమంగా అవ్వక ఇబ్బందులు పడుతారని అధికారులు తమ విధులు సమర్థవంతంగా నిర్వహించి సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అలానే తోటవారిపాలెం, గవినివారిపాలెం పంపింగ్ స్కీంల ద్వారా వేలాది ఎకరాలు పంటలు సాగు చేస్తారని వీటి ద్వారా నీటి సరఫరాల ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

మెడికల్ కిట్లు అందజేత


సుబ్బారావుకి మెడికల్ కిట్‌లు అందిస్తున్న శేఖర్

వేటపాలెం: పందిళ్లపల్లిలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్న పమిడాల సుబ్బారావు అలియాస్ షారుఖ్‌ఖాన్ కి రూ.10 వేలు విలువగల మెడికల్ కిట్లు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ పోలకం శేఖర్ మాట్లాడుతూ తన పెదనాన్న పెద్దమ్మ జ్ఞాపకార్థం ఉచిత వైద్యం అందిస్తున్న సుబ్బారావుకి మెడికల్ కిట్‌లు అందించినట్లు తెలిపారు. షుగర్, యాక్సిడెంట్, వంటి పేషెంట్స్‌కి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న సుబ్బారావుకి అవసరమైన ఆర్థిక నిధులు సమకూర్చేందుకు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మెట్టు వాసు, చెరుకూరి శ్రీనివాసరావు, శివ, బి. శ్రీనివాసరావు, ఎం. రమణ, పి. రాజు, బి. సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రావెల్ తోలకాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

అద్దంకి: మండలంలోని ధర్మవరం నుంచి గ్రావెల్ తోలుతున్న టిప్పర్లను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామంలోని గ్రావెల్‌ను తోలవద్దని అడ్డుకున్న గ్రామస్తులపై లారీ డ్రైవర్లు దాడికి దిగినట్లు గ్రామస్తులు తెలిపారు. అక్రమంగా తోలుతున్న గ్రావెల్ ను అడ్డుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు.


టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

రెడ్ క్రాస్ నూతన కార్యవర్గం ఎన్నిక


రెడ్‌క్రాస్ చీరాల బ్రాంచ్ నూతన కమిటీ సభ్యులకు సూచనలందిస్తున్న తహసీల్దార్ గోపికృష్ణ

చీరాల టౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చీరాల బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీరాల తహసీల్దార్ కె.గోపికృష్ణ అధ్యక్షతన చీరాల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెడ్‌క్రాస్ చీరాల బ్రాంచ్ చైర్మన్‌గా బూదరాజు శశికిరణ్, వైస్ చైర్మన్ డాక్టర్ ఐ.బాబూరావు, వైస్ ప్రెసిడెంట్‌గా సూరంపల్లి తేజస్వీ, కోశాధికారిగా దాసరి ఇమ్మానియేల్, కార్యదర్శిగా జీపీవీ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అలానే మేనేజింగ్ కమిటీ సభ్యులుగా తాడివలస కుమార్, మంకెన మణిబాబు, టి.అబ్దుల్, జె.వెంకటసాయి కృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్, రాంప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి సభ్యుడు సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. ఆపదలో ఉన్న వారికి రెడ్‌క్రాస్ సహాయ సహకారాలు అందించాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు డాక్టర్ వీరరాఘవయ్య, ప్రసాద్ రెడ్డి, వ్యహరించగా రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు బోయిన శ్రీనివాసులు, సాయిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ సభ్యుల దాతృత్వం


పేద విద్యార్థిని సత్కరించి ఆర్థిక సాయం అందజేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చీరాల రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ ఎస్‌ఆర్‌అండ్ పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు పదో తరగతిలో అత్యుత్తమంగా 583 మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థిని ఇమ్మడిశెట్టి జయశ్రీకి ఉన్నత చదువుల నిమిత్తం రూ. 37,500 ఆర్థిక సాయంతో పాటు నోటు పుస్తకాలు అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానం ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడారు. వాకర్స్ సభ్యుడు ఇమ్మడిశెట్టి రాధాకృష్ణమూర్తి కుమార్తై జయశ్రీ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించడం మంచి పరిణామమని కొనియాడారు. పేదరికంలో ఉన్నామని ఉన్నత చదువులు చదివించలేమని ఆర్థికంగా సాయం అందించాలని రాధాకృష్ణమూర్తి అభ్యర్థించడంతో సభ్యులందరి సహాయ సహకారంతో విద్యార్థినికి ఆర్థిక సాయమందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలానే గోవులు పోషణ నిమిత్తం శ్రీకృష్ణ గోశాలకు రూ. 1500 అందించారు. చారుగుళ్ల గురుప్రసాద్, నారాయణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, బాల గంగాధరరావు, చింతా రమేష్, గుర్రం బదరీనాథ్, వీరాంజనేయులు, తిరుపతిరావు, పూర్ణా, కాటమరాజులు పాల్గొన్నారు.

లో వోల్టేజీతో తిప్పలు


విద్యుత్‌లో వోల్టేజీ సమస్యతో అల్లాడుతున్న చెరుకూరు కృపా కాలనీ వద్ద విరిగిపడిన కరెంటు స్తంభం

పర్చూరు(చినగంజాం): పర్చూరు మండలంలోని చెరుకూరు కృపా కాలనీలో లోవోల్టేజీ సమస్య ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తోంది. గృహాల్లో లైట్లు వెలగడం లేదు. వేసవి ఉక్కపోత తట్టుకునేందుకు ఫ్యాన్‌లు తిరగడం లేదు. దీంతో స్థానిక కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా ఈదురు గాలులకు చెరుకూరులోని చర్చి వద్ద ఒక కరెంటు స్తంభం విరిగి పడిపోయింది. అప్పటి నుంచి చర్చి వద్ద ఉన్న కృపా కాలనీ ప్రాంతంలో కరెంటు ఉన్నప్పటికీ లో వోల్టేజీ ఏర్పడి లైట్లు సరిగా వెలగడం లేదని, ఫ్యాన్‌లు తిరగడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. కరెంటు స్తంభం పడిపోయిన స్థానంలో మరొక స్తంభాన్ని ఏర్పాటు చేసి లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ సమస్యపై స్థానిక విద్యుత్ లైన్‌మాన్, కరెంటు ఏఈ, ఏడీఈ కి ఫిర్యాదు చేసినా చూస్తాములే అంటూ కాలయాపన చేస్తున్నారని వారి ఆవేదనను వెలిబుచ్చారు. తమ కాలనీలో లోవోల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని తాము పడుతున్న ఇబ్బందులను తొలగించి ఆదుకోవాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

కిశోర వికాసంతో విద్యపై పట్టు


ఇద్దరు విద్యార్థులను జెడ్పీ హైస్కూల్‌లో చేర్చుకుంటున్న హెచ్‌ఎం సరోజిని

వేటపాలెం: విద్యతోనే జీవితానికి వెలుగు వస్తుందని, ఆటు వంటి విద్యను మధ్యలో ఆగిపోతే జీవితమంతా అంధకారం అవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవల్లి పేర్కొన్నారు. ఆదివారం బడి మధ్యలో మానివేసిన విద్యార్థులను హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్త బుల్లెమ్మాయి చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేటపాలెం ఐసీడీఎస్ సెక్టార్‌లని నాయనపల్లి 4 అంగన్‌వాడీ పరిధిలోని బడి మధ్యలో మానేసిన ఇద్దరు బాలికలను జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతిలో చేరిప్పించామని తెలిపారు. బడి మానేడం ద్వారా జరిగే అనర్థాలను బాలికలకు తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త దేవతోటి బుల్లెమ్మాయిని సీడీపీఓ టి. ఝాన్సీ, సూపర్‌వైజర్ అభినందించారు.

వృద్ధులకు జీవించే హక్కు



మాట్లాడుతున్న న్యాయవాది

అద్దంకి: వృద్ధులకు హక్కులు ఉంటాయని న్యాయవాదులు వెల్లడించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఆదివారం వృద్ధాశ్రమంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ వృద్ధులకు జీవించే హక్కు, తన పిల్లల నుంచి సహాయం పొందేవంటి ఎన్నో హక్కులున్నాయని చెప్పారు. ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులు టి. మార్త, శీనుక, ఎం. ప్రకాష్ షేక్ మహమ్మద్ రఫీ పాల్గొని చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో శ్రీరామ వద్ధాశ్రమం నిర్వాహకులు శ్రీ రావూరి రంగయ్య, వృద్ధులు పాల్గొన్నారు. అలాగే రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చప్పిడీ వీరయ్య ఆదివారం శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో ఒక్కోరికి ఐదు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు పాల్గొన్నారు.